క్లుప్తంగా

15 రోజులకొకసారి వాటర్ ట్యాంక్‌లు శుభ్రపరచాలి


ఎంజేవలస వాటర్ ట్యాంకు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రాజాం: ప్రతీ 15 రోజులకొకసారి వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తీసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి ఎన్.నిర్మలకుమారి అన్నారు. మండలంలో బొద్దాం, జీసీహెచ్‌పల్లి, ఎంజేవలస తదితర గ్రామాల్లో రక్షిత పథకం వాటర్ ట్యాంకులను గురువారం పరిశీలించారు. ప్రతీ గ్రామంలో తాగునీటి వనరులను శుద్ధి చేస్తూ ఉండాలని, ప్రజలకు అనారోగ్య సమస్య రాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు చేపట్టండి


ఇరిగేషన్ ఏఈలతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన ఇరిగేషన్ ఏఈఈలు హరిబాబు, వెంకట్‌లతో సమావేశమయ్యారు. మండలంలో నిర్వహించనున్న సాగునీటి ఎన్నికలకు సంబంధించిన విధివిధానాలు వివరించారు. నవంబరు 24వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సిబ్బంది పనితీరు మారాలి


కాలువల్లో మురుగు తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని, గ్రామాల్లో ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది పని చేయాలని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. మండలంలోని దిబ్బగుడ్డివలసలో గురువారం ఆయన పర్యటించారు. కాలువల్లో నిల్వ ఉన్న సిల్ట్‌ను తొలగించేలా చర్యలు చేపట్టారు. వాటర్ ట్యాంకును శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న ప్రభుత్వ సిబ్బంది పని తీరు మారాలని, మెరుగైన ఆలోచనా విధానంతో భాద్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి ఇతర సిబ్బంది ఉన్నారు.

సోలార్ మంచినీటి పథకంలో క్లోరినేషన్


మంచినీటి పథకంలో క్లోరినేషన్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

తెర్లాం: మండలంలోని కవిరాయునివలస గ్రామంలోని సోలార్ మంచినీటి పథకంలో క్లోరినేషన్ పనులు గురువారం చేశారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఎంపీడీఓ రేగి రాంబాబు, సచివాలయ ప్రత్యేకాధికారి జె.త్రినాధరావు ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వి.హరి సోలార్ మంచినీటి పథకాన్ని శుభ్రం చేయించారు. గ్రామంలో మరమ్మతులకు గురైన బోరుబావులను బాగు చేయించి తాగు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

పట్టుదలతో శ్రమిస్తే విజయం ఖాయం


మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు శివకృష్ణ

రాజాం : పట్టుదల, ప్రయత్నం, ఓర్పుతో విజయం ప్రాప్తిస్తుందని రాజాంకు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణులు బూరాడ శివకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో జీఎంఆర్ కేర్ ఆస్పత్రి వద్ద కానిస్టేబుల్, ఆర్మీ, ఎస్ఐ తదితర పోస్టుల నిమిత్తం ఫిజికల్ శిక్షణ పొందుతున్న యువతీ యువకులకు అవగాహన కల్పించారు. గత ఏడాది కాలంగా రాజాం ప్రాంతానికి చెందిన ఆర్మీ ఉద్యోగులు ఎ.శ్యామలరావు, బి.లక్ష్మణరావు ఇక్కడ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా ప్రతీరోజు ఉదయం శిక్షణ ఇస్తున్నారు. ఉచిత శిక్షణ ఇస్తున్న ఆర్మీ ఉద్యోగులను ఈ సందర్భంగా అభినందించారు.

ఇదేమి..'చెత్త' పాలన

జిల్లాలో డయేరియా విజృంభించి గుర్ల మండలంలో పలువురిని పొట్టన పెట్టుకుంది. వందల సంఖ్యలో రోగులను మంచమెక్కించింది. అయినా అధికారులకు పట్టడం లేదు. ప్రజారోగ్యాన్ని పట్టించుకోవాల్సిన పాలకులు కూడా తమకేమీ కానట్టువ్యవహరిస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో పలు గ్రామాల్లో తాజాగా దర్శనమిస్తున్న చెత్త కుప్పలే ఇందుకు నిదర్శనం. జనావాస ప్రాంతాల్లో కుప్పలుతెప్పలుగా చెత్త కుప్పలు కనిపిస్తున్నా అధికారులు కనీసం స్పందించడం లేదు.

- పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం గాలికొదిలేసిన అధికారులు
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- ప్రజారోగ్యంతో చెలగాటం

నియోజకవర్గంలో మండలాల వారీగా పంచాయతీలు, గ్రామాల వివరాలు

మండలం	పంచాయతీలు	గ్రామాలు
రామభద్రపురం	22	52
తెర్లాం	33	55
బాడంగి	25	41
బొబ్బిలి	30	52
మొత్తం	110	200


చొక్కాపు వీధి నుంచి బొబ్బిలి వెళ్లే రోడ్డుపై డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్తకుప్ప


చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాల వద్ద డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్తకుప్ప

రామభద్రపురం: బొబ్బిలి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. గ్రామాల్లో పలుచోట్ల చెత్త కుప్పలు దర్శనమిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. పలు గ్రామాల్లో ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడికక్కడ చెత్తకుప్పలు, మురుగు నిల్వలు

ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు, ఇళ్ల మధ్య మురుగు నిల్వలు కనిపిస్తున్నాయి. కొద్దిపాటి వర్షపు జల్లులకు నీరు చేరి దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అటువంటి ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయడం, నీటి నిల్వలను తొలగించడం తదితర చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో మురుగు నీరు నీరు నిల్వ ఉన్నచోటే పందులు, కుక్కలు కూడా సంచరిస్తున్నాయి. వీటితో పాటు ఇంటి పరిసరాల్లో వాడని డబ్బాలు, పాత వస్తువులు, పాలిథిన్ కవర్లు, టైర్లు పడేయడంతో వాటిలో వర్షపు నీరు చేరి దోమలు ఆవాసాలుగా మారుతున్నాయి.

స్వచ్ఛతా..నువ్వెక్కడ?

గ్రామాలు స్వచ్ఛంగా రూపుదిద్దుకోవాలంటే మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ ప్రధాన మార్గం అనే మహాత్మా గాంధీ నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కేవలం అధికారుల ఆర్భాటాలకు, ప్రచారాలకే పరిమితమైంది. మండల కేంద్రంలోని చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాల ఆవరణ, చొక్కాపు వీధి నుంచి బొబ్బిలి వెళ్లే రహదారిలో ఉన్న అపరిశుభ్రతే ఇందుకు నిదర్శనం. డ్రైనేజీలు చెత్తా చెదారాలతో నిండి దుర్వాసన కొడుతున్నాయి. స్థానికులు చెత్త తీసుకొచ్చి నేరుగా రోడ్డుపై వేయడంతో పలు ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో పారిశుద్ధ్యం పడకేసి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పలు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులే దర్శనమిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదు. సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని పలు గ్రామాల్లో చెత్తా చెదారం తొలగింపు, మురుగు కాలువల శుభ్రత పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

తూతూ మంత్రంగా పరిశీలన

ఇటీవల గుర్లలో జరిగిన ఘటనతో మండల ప్రత్యేకాధికారితో పాటు ఎంపీడీఓ, తహసీల్దార్ గ్రామాలలో సుడిగాలి పర్యటనలు చేశారు. గ్రామాలలో ఉన్న మంచినీటి ట్యాంకులు పరిశీలించారు. పీహెచ్‌సీలు సందర్శించి గ్రామాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులకు గ్రామాలలో పరిశుభ్రత పనులు చేపట్టాలని, మంచినీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని సూచించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులకు దోమలు, అపరిశుభ్రతే ప్రధాన కారణం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ఊదరగొట్టే మాటలు, ప్రచార ఆర్భాటాలే తప్ప పనిచేస్తున్న సందర్భాలు లేవని ఆయా గ్రామాల ప్రజల నుంచి విమర్శలొస్తున్నాయి.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు..



గ్రామాలలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించకూడదని కార్యదర్శులకు సూచించాం. అలాగే మురుగు కాల్వల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలి. మంచినీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుద్ధి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రతీ రోజు రోజుకో గ్రామం సందర్శించి పారిశుద్ధ్యం, మంచినీటి ట్యాంకులు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెడతాం.
– ప్రశాంత్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి

సర్పంచ్‌లకు తెలియకుండా పనులా..!


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్‌లకు తెలియకుండా ఎలా పనులు చేపడతారని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సమావేశంలో పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. అన్ని పంచాయతీల్లో అతిసారం, జ్వరం సర్వేలను నిర్వహించామని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశంతో సర్పంచ్‌లు ఉపాధి హామీ పనులకు తీర్మానం చేస్తే వారికి తెలియకుండా టీడీపీ నాయకులు చెప్పారని వెండర్ కోడ్స్ ఎలా రిజిస్టర్ చేస్తారని ఏపీఓను ఎంపీపీ నిలదీశారు. కొత్తగా గ్రామాల్లో ఎంత మంది బుక్ కీపర్లను నియమించారని ఏపీఎం సత్యనారాయణను ప్రశ్నించారు. లోతుగెడ్డ పంచాయతీలో కొత్తవారిని ఎలా నియమించారని అడగ్గా తనకు తెలియదని సమాచారం ఇవ్వడంతో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు సమాచారం లేకుండా సమావేశానికి ఎందుకు వస్తారని సభ్యులు నిలదీశారు. సమావేశంలో తహసీల్దార్ కె.ఈశ్వరరావు, ఎంపీడీఓ భానుమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి


గుయ్యానవలసలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు


గ్రామ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

రాజాం : రెవెన్యూ సదస్సులు ద్వారా భూముల సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎస్‌కే రాజు రైతులకు సూచించారు. మండలంలోని గుయ్యానవలస గ్రామంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. రైతుల భూముల విస్తీర్ణంలో తేడాలు, 1బీలో లోపాలు తదితర వాటిని సవరించేందుకు ఈ సదస్సులు ద్వారా దరఖాస్తులు తీసుకుంటున్నామని అన్నారు. రైతులు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్వే డీటీ అనంత్‌కుమార్, ఆర్ఐ విద్యాసాగర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం...

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ అప్పయ్య అన్నారు. మండలంలోని కలవరాయి, వాకాడవలస గ్రామాల్లో గురువారం రెవెన్యూ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని, ఆందోళన వద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ సతీష్, సర్పంచ్‌లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం


పాఠశాల ఆవరణలో ప్రత్యేకాధికారి ప్రశాంత్‌కుమార్ తదితరులు

రామభద్రపురం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని ప్రత్యేకాధికారి ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని మామిడివలస గ్రామంలో ఎంపీడీఓ రత్నంతో కలిసి గురువారం గ్రామ సందర్శన నిర్వహించారు. ముందుగా అక్కడ ఉన్న ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పిల్లలను, హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి పరిశీలించారు. వంట గది, పాఠశాల ఆవరణంతా పరిశుభ్రంగా ఉంచాలని హెచ్‌ఎంకు ఆదేశించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అన్ని వీధులలో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మూడడ్ల అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల అధికారాలను హైజాక్ చేసే యత్నం

బాడంగి: పంచాయతీలకు సర్పంచ్‌లే సర్వాధికారులు కాగా.. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులన్నీ పంచాయతీ పరంగా సర్పంచ్‌లతోనే చేపట్టడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా వారి అధికారాలను హైజాక్ చేస్తూ అభివృద్ధి పనులు వెండర్ల పేరుతో వారి అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్న విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం లేని సర్పంచ్‌ల స్థానంలో వెండర్లను నియమించి వారి పేరున పనులు మాత్రమే చేయించి నిధులు విషయంలో పంచాయతీపరంగా సర్పంచ్‌లకే అధికారం ఉండేలా చూసేవారని పలువురు సర్పంచ్‌లు చెబుతున్నారు. ప్రస్తుతం అలా కాకుండా సర్పంచ్‌లను పక్కన పెట్టి వెండర్ల పేరుతో పనులు చేయించి వారి ఖాతాల్లోనే నేరుగా బిల్లులు పడే విధంగా చర్యలు చేపట్టారని ప్రతిపక్ష పార్టీల సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2024 – 25 ఏడాదికి సంబంధించి ఐదో విడత మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 26లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27లోగా దగ్గరలోని ఐటీఐలో 10వ తరగతి, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. వివరాలకు 9000096048, 8309438446, 9959502238, 9052085679 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మామిడిపల్లిలో గ్రామ సందర్శన

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లిలో గ్రామ సందర్శన కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

తుఫాన్‌తో తస్మాత్...


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: దానా తుఫాన్ పొంచి ఉన్నందున విద్యుత్ శాఖ పరంగా ఎలాంటి సమస్యలకు ప్రజలకు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ లైన్‌మన్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగానే దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. విద్యుత్ తీగలను సరిచేయాలని ఆదేశించారు. విద్యుత్ పరంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జూనియర్ లైన్‌మన్లు పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన


రేగిడిలో కోత దశలో వరి పంట

రేగిడి : దానా తుఫాన్ ప్రకటనతో రైతులు ఆందోళన చెబుతున్నారు. పంట చేతికందొచ్చే సమయంలో తుఫాన్ ప్రభావంతో చేలు దెబ్బతింటాయోనన్న ఆందోళన వారిలో నెలకొంది. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటే ఆరుగాలం కష్టపడి పండించిన పంట దిగుబడులు నష్టపోవడం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాడంగిలో..

బాడంగి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వాయుగుండంగా మారి తుఫాన్‌గా మారనున్నట్లు అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిచేలు కోత దశకు వస్తున్న తరుణంలో ఇలా తుఫాన్ హెచ్చరికలు వారిలో ఆందోళనలు కలిగిస్తున్నాయి. వరి పంట కోతకు సిద్ధమవుతున్న సమయంలో తుఫాన్ సంభవిస్తే తీవ్రంగా నష్టపోక తప్పదని వారు ఆవేదన చెందుతున్నారు.

గొల్లాదిని సందర్శించిన జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి


గొల్లాదిలో వైద్యసిబ్బందిని ఆరాతీస్తున్న డాక్టర్ అచ్యుత కుమారి

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామాన్ని జిల్లా వైద్య శాఖకు చెందిన ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ అచ్యుతకుమారి గురువారం సందర్శించారు. గొల్లాదిలో రెండున్నరేళ్ల ఎస్.యామినికి తట్టు వ్యాధి పాజిటివ్ రావడంతో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ నుంచి విజయనగరం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేసి చికిత్స చేయడంతో జిల్లా వైద్య శాఖ ఉలిక్కి పడింది. వెల్‌నెస్ కేంద్రంలో వైద్య శాఖ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామంలో పార్మేట్ ప్రకారం సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఇలాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాడాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదిత్య, ఏఎన్ఎం మంగమ్మ, ఎంఎల్‌హెచ్ పి.వాసవి, ఎంపీహెచ్‌ఈఓ జోగినాయుడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకుంటే చర్యలు


మధ్యాహ్న భోజన పథకం వంటలు పరిశీలిస్తున్న ఎంఈఓ

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు జరుగుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో లోపాలు ఉంటే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంఈఓ జె.త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ – 2 పాపారావుతో కలిసి ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, విద్యార్థుల హోం వర్కు పుస్తకాలు, చేతిరాత, మధ్యాహ్న భోజన పథకం వంటలు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రంగప్పవలస పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, చేతిరాత, హోంవర్కు పుస్తకాల దిద్దడం, భోజన పథకంలో సక్రమంగా మెనూ అమలు, మరుగుదొడ్ల నిర్వహణ, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లానింగ్, డైరీ నిర్వహణ సంతృప్తికరంగానే ఉన్నాయని తెలిపారు. ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

సంక్షిప్తంగా...

ముందస్తు జాగ్రత్తలతోనే పోలియో నిర్మూలన


అవగాహనా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాజాం సిటీ: ప్రతి చిన్నారికి ముందస్తు జాగ్రత్తలతోనే పోలియో నిర్మూలించవచ్చునని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గట్టి భార్గవి అన్నారు. గురువారం ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభావతి జాగృతి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులచే అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యారావు, రొటేరియన్, ప్రభావతి జాగృతి ట్రస్టు వ్యవస్థాపకులు సప్పటి వసంతరావు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట పరిశీలన

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో ఆకు ఎండు తెగులు సోకిన వరి పంటను డీఆర్‌సీ ఏడీఏ భారతి, రాజాం ఏడీఏ చంద్రరావు, మండల ఏఓ పైల నవీన్‌లు గురువారం పరిశీలించారు. ఆకు ఎండు తెగులు నివారణ కోసం రైతులకు పలు సూచనలు చేశారు. బాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూడాలని సూచించారు. తెగులు ఆశించిన పొలంలో నత్రజని వేయకూడదని తెలిపారు. కాపర ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి 2 నుంచి 3 సార్లు వ్యవధిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంట దిగుబడి సమీపిస్తున్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి : మండలంలో వండానపేట, గుళ్లపాడు, కేఎంవలస, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో తాగునీటి బోర్లకు గురువారం మరమ్మతులు చేశారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పంచాయతీ సర్పంచ్‌లు వెల్లడించారు. తాగునీటి వనరులు వద్ద మురుగునీటి నిల్వలు లేకుండా చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీ చరణ్ ఈ సందర్భంగా మెకానిక్‌లకు సూచించారు.

అన్న ప్రసాదానికి రూ.50 వేలు వితరణ


రూ.50 వేల సాయాన్ని అందిస్తున్న మహేశ్వరరావు తదితరులు

రాజాం : పట్టణంలోని కొండంపేట గ్రామంలో ధర్మశాస్త్ర హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో 41 రోజుల పాటు జరిగే అయ్యప్పస్వాముల అన్నప్రసాదానికి రూ.50 వేల సాయాన్ని దాతలు అందించారు. రాజాంకు చెందిన పాలవలస మహేశ్వరరావు, శైలజ దంపతులు ఈ విరాళాన్ని గురువారం ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావుతో పాటు సభ్యులకు అందజేశారు.

పత్ర ద్రావణాల తయారీపై అవగాహన

రాజాం : పత్ర ద్రావణాలు తయారీపై రైతులకు ప్రకృతి వ్యవసాయం అధికారులు అవగాహన కల్పించారు. గురువారం మండలంలో కొతారిపురం గ్రామంలో పలు పత్రాలతో ద్రావణాలు తయారీ చేసి, వాటిని వినియోగించే విధానం, రబీలో వాటి ఉపయోగం, సిరిధాన్యాల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 18 రకాల పత్రాలు సేకరించి, వాటి ద్వారా 200 లీటర్ల పత్ర కషాయాలు తయారీపై రైతులకు వివరించారు. వీఏఏ సత్యవతి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, కొతారిపురంతో పాటు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

రేగిడి : అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యం పట్ల కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలో సోమరాజుపేట, అంబఖండి అంగన్‌డీ కేంద్రాలను ఆమె గురువారం ఆమె సందర్శించారు. బాలింతలు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రతీ నెల వైద్య సేవలు పొందాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

రేగిడి : రబీలో రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని అంబఖండి, ఖండ్యాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని వెల్లడించారు. పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు వినియోగిస్తే ఆరోగ్యవంతమైన పంటలు సాధ్యమని తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

రామభద్రపురం: మండలంలోని రావివలస ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు గురువారం గుండె పోటుతో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన పి.వెంకటప్పడు(57) మండలంలోని రావివలస గిరిజన గ్రామ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. గురువారం రోజూలాగే పాఠశాలకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో కొండకెంగువ ఏడొంపుల గెడ్డ దగ్గరకొచ్చేసరికి టాయిలెట్‌కు వెళ్లి ఆకస్మాత్తుగా వెనక్కి తిరగబడి మృతి చెందాడు. గత ప్రభుత్వంలో 1998 బ్యాచ్ కింద ఈయన ఉపాధ్యాయ ఉద్యోగం పొందారు.

నేడు విద్యుత్ సరఫరాకుఅంతరాయం

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట నుంచి వచ్చే 11 కేవీ ఫీడర్ వద్ద మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ అనంతరావు గురువారం తెలిపారు. పెంట, రంగరాయపురం, జే రంగరాయపురం, భీమవరం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు దీన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

వంగరలో..

వంగర: మండలంలోని వివిధ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాంబశివరావు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఓనె అగ్రహారం, సంగాం, వంగర గ్రామాల సమీపంలో చెట్ల కొమ్మలు తొలగింపు, సబ్‌స్టేషన్ మరమ్మతులు చేయనున్నామని పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలిగే అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.